క్లుప్తంగా

జీవీఎంసీ కమిషనర్‌కు ఎమ్మెల్యే వాసుపల్లి వినతి



జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

అల్లిపురం : నియోజకవర్గం పరిధిలో ప్రస్తుతం జరుగుతున్న పలు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ శనివారం జీవీఎంసీ కమిషనర్ సాయి కాంత్‌వర్మను అతని ఛాంబర్లో కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలోని 14 వార్డుల్లో కమ్యూనిటీ హాళ్లు నిర్మించాలని, 60 అడుగుల రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని, ఇసుకకొండ సత్యనారాయణ స్వామి ఆలయ ఘాట్‌రోడ్డు పనులు పూర్తి చేయాలని, హాకర్స్ జోన్ నిర్మించాలని, మరి కొన్ని నూతన పనులు మంజూరు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ మేరకు జీవీఎంసీ కమిషనర్ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

వైవీ సుబ్బారెడ్డిని కలిసిన మండల అధ్యక్షులు



వైవీని సన్మానిస్తున్న మండల అధ్యక్షులు

దాబాగార్డెన్స్ : వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని దక్షిణ నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుగా నియమితులైన పీతల వాసు, కొల్లి సింహాచలం శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కోడిగుడ్ల పూర్ణిమ, కోడూరు అప్పలరత్నం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నృసింహుడికి ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయ దాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, శ్రీకాంతాచార్యులు తదితరులు ఈసేవ నిర్వహించారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి శనివారం గరుడసేవ ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఆలయ కల్యాణమండపంలోని గరుడ వాహనంపై అధిష్టంపజేశారు.

మిసెస్ ఇండియా రన్నరప్‌గా జ్యోతి కొత్తపల్లి



జ్యోతి కొత్తపల్లిని అభినందిస్తున్న పలువురు మహిళలు

అల్లిపురం : మిసెస్ ఇండియా రన్నరప్‌గా జ్యోతి కొత్తపల్లి ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన పోటీల్లో నగరానికి చెందిన ఆమె పాల్గొన్నారు. నగరానికి వచ్చిన ఆమెను పలువురు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవితంలో ఏదో ఒకటి సాధించాలనే ఉద్దేశంతోనే తన ఆరోగ్యం సహకరించకపోయినప్పటికీ పోటీల్లో పాల్గొన్నానని తెలిపారు. తన ప్రయత్నానికి కుటుంబ సభ్యుల సహకారం అందిందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధిస్తానని ఆమె తెలిపారు.

పాలన భేష్.. పథకాలు శభాష్

- జగనన్న ఆరోగ్య సురక్షకు ప్రజల ప్రశంసలు
- పాతనగరంలోని పలు సచివాలయాల పరిధిలో చురుగ్గా ఇంటింటి ఆరోగ్య సర్వే



వన్‌టౌన్ ప్రాంతంలో పరీక్షలు నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

అల్లిపురం : ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది. రానున్న రెండు నెలల పాటు ఆరోగ్య సురక్ష కొనసాగనుంది. ఈ పథకంలో భాగంగా ఇంటింటి సర్వే, ఉచిత పరీక్షలు, మందుల అందజేత, అవసరాన్ని బట్టి చికిత్స అందించనుంది ప్రభుత్వం. నియోజకవర్గంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభమైంది. దీంట్లో భాగంగా శనివారం అన్ని సచివాలయాల పరిధిలో పరీక్షలు చేశారు. కుమ్మరవీధి సచివాలయం పరిధిలో జరిగిన కార్యక్రమంలో ఏఎన్‌ఎం వెంకటలక్ష్మి, సూపర్‌వైజర్ రామకృష్ణ, ఆశ వర్కర్ పార్వతితో పాటు వలంటీర్లు ఝాన్సీ, కిరణ్మయి, పార్టీ నాయకులు పాల శ్రీహరిరెడ్డి, నీలాపు అయ్యప్పరెడ్డి తదితరులు ఇంటింటి సర్వే చేపడుతున్నారు. జీవీఎంసీ 33వ వార్డు భీమ్‌నగర్ డాక్టర్ వైఎస్‌ఆర్ అర్బన్ హెల్త్ క్లినిక్, కొబ్బరితోట హెల్త్ క్లినిక్‌ల ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే కార్యక్రమం చురుగ్గా కొనసాగుతోంది. దీంట్లో భాగంగా మొత్తం ఐదు దశల్లో ఈ కార్యక్రమం ఉంటుంది.

మొదటి దశలో 7 పరీక్షలు..

మొదటి దశలో బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ పరీక్షలు చేస్తారు. అవసరాన్ని బట్టి యూరిన్, మలేరియా, డెంగీ, కఫం వంటి 7 పరీక్షలు చేపడతారు. ప్రతి ఇంటికి వెళ్లి, ప్రతి ఒక్కరిని పరీక్షిస్తారు. ఆరోగ్యశ్రీ ద్వారా మ్యాపింగ్ చేస్తారు. టెస్టుల్లో వచ్చిన ఫలితాల ఆధారంగా ఆరోగ్య శిబిరాల్లో వారికి చికిత్స అందజేస్తారు. ఆరోగ్యశ్రీని ఎలా ఉపయోగించుకోవాలి అన్నదానిపై అవగాహన కల్పిస్తారు. వారికి గల జబ్బుకు ఎలా చికిత్స అందజేస్తారు, ఎక్కడికి వెళ్లాలి, ఇబ్బంది ఉంటే ఎవరిని సంప్రదించాలి అన్న వివరాలతో కూడిన బ్రోచర్లు అందజేస్తున్నారు. ఫోన్లలో ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేయిస్తారు.

గర్భిణులు, బాలింతలపై ప్రత్యేక దృష్టి..

ముఖ్యంగా గర్భిణులు, బాలింతలపై ప్రత్యేక దృష్టి సారిస్తారు. అదే విధంగా అవ్వాతాతలకు కంటి పరీక్షలు చేసి కళ్లజోళ్లు అందజేస్తారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఈ సేవలన్నీ అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారు.

కోటవీధిలో..



కోటవీధిలో పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి డాక్టర్ సింధు

దాబాగార్డెన్స్ : జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వే శరవేగంగా జరుగుతుందని, ఈ సర్వేలో దీర్ఘకాలిక రోగులను గుర్తించి ఇంటి వద్దే తొలిస్థాయిలో వైద్య పరీక్షలు చేస్తున్నామని వన్‌టౌన్‌లో గల మౌలాలీపంజా అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సింధు తెలిపారు. శనివారం ఆమె థాంప్సన్ స్ట్రీట్ సచివాలయ పరిధిలోకి వచ్చే కోటవీధిలో రోగులను పరీక్షించారు. సర్వే బృందానికి పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ మౌలాలీపంజా అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈనెల 6వ తేదీన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నామని తెలిపారు. ఈ శిబిరంలో ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యులతో పాటు మరో నలుగురు వైద్యులు పాల్గొంటారన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ వైద్య శిబిరం ఉంటుందన్నారు.

మంచి పథకం..



జగనన్న ఆరోగ్య సురక్ష చాలా మంచి పథకం. దీనిని అమలు చేయడం ద్వారా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రజల ఆరోగ్యం పట్ల ఎంత శ్రద్ధ తీసుకుంటున్నారో అర్థమవుతోంది.

– డి.కళ్యాణి, బంగారుమెట్ట

పథకం అమలైతే అందరికీ రక్ష..



ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం సక్రమంగా అమలు జరిగితే అందరికీ రక్షగా నిలుస్తుందని చెప్పొచ్చు. ప్రజలంతా దీనిని ఉపయోగించుకోవాలి.

– మర్రి రూప, అల్లిపురం

ఉచితంగా పరీక్షలు చేస్తున్నారు..



జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో ఇంటింటికీ వచ్చి ఉచితంగా పరీక్షలు చేయడం బాగుంది. మంచి కార్యక్రమాలకు ప్రజల మద్దతు ఎప్పుడూ ఉంటుంది. ప్రజారోగ్యం పట్ల ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్న చర్యలు అభినందనీయం.

– కె.నాగలక్ష్మి, కుమ్మరవీధి

పేదవాళ్లకు ఎంతో మేలు..



జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా ఆరోగ్య పరీక్షలు చేపట్టడం పేదవాళ్లకు ఎంతో మేలు. వేలకు వేలు ఖర్చు చేసి పరీక్షలు చేయించుకోలేని వారికి ఎంతో ఉపయోగపడుతుంది. మంచి కార్యక్రమానికి ప్రజల అండ ఎప్పుడూ ఉంటుంది.

– జి.లక్ష్మి, కుమ్మరవీధి

మరిన్ని కుంభకోణాల్లో బాబుకు శిక్ష పడాల్సి ఉంది

- మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు డాక్టర్ మంగరాజు



సమావేశంలో మాట్లాడుతున్న మంగరాజు

దాబాగార్డెన్స్ : నేను నిప్పు.. నేను ఉప్పు అన్న చంద్రబాబునాయుడు నేడు రాజమండ్రి సెంట్రల్ జైల్లో తుప్పయ్యారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు డాక్టర్ చీకటిమిల్లి మంగరాజు అన్నారు. డాబాగార్డెన్స్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు దొంగల ముఠా నాయకుడని విమర్శించారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో రూ. 371 కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. ఔటర్‌రింగ్ రోడ్డు, ఫైబర్‌గ్రిడ్, అమరావతి భూముల వ్యవహారాల్లోనూ, పోలవరం ప్రాజెక్టు సబ్‌కాంట్రాక్ట్ వ్యవహారంలోనూ ఇంకా శిక్ష పడాల్సి ఉందని చెప్పారు. 14 ఏళ్లలో సుమారు రూ.2 లక్షల కోట్ల పైచిలుకు సంపాదించారని తెలిపారు. టీడీపీ శ్రేణులు సానుభూతికి దీక్షలు చేస్తున్నారని, కానీ ప్రజల్లో స్పందన లేదన్నారు. స్టేలు తెచ్చుకోకపోతే ఇప్పటికే జైలు జీవితం గడిపేవారన్నారు. లోకేష్‌కు సీఐడీ అధికారులు నోటీసులు ఇచ్చారని, అతను కూడా తప్పు చేశాడని చెప్పడానికి ముందస్తు బెయిల్ పిటిషనే నిదర్శనమన్నారు. చంద్రబాబు కేసులో అన్ని ఆధారాలు చూసి, జడ్జి తీర్పు ఇస్తే సోషల్ మీడియాలో జడ్జిపై అసభ్యంగా ట్రోల్ చేయడాన్ని మంగరాజు తీవ్రంగా ఖండించారు. ట్రోల్ చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దసరా నుంచి విశాఖ కేంద్రంగా పరిపాలన సాగిస్తానని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటనపై మాల మహానాడు స్వాగతిస్తుందన్నారు. విజయవాడలో యావత్ దేశం హర్షించేటట్టుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని సుమారు రూ.400 కోట్లకు పైగా వెచ్చించి నిర్మించడం అభినందనీయమన్నారు. 2024 ఎన్నికల్లో 175 సీట్లు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలుచుకోవడం ఖాయమన్నారు. సమావేశంలో టి.శివ, డి. కోటేశ్వరరావు, పి. రామారావు, జి. వెంకటేశ్వరరావు, సందీప్, సునీల్‌బాబు, రోహిత్ పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్‌లో ప్రోగ్రామర్ల దినోత్సవం



విజేతలతో అధ్యాపకులు డాక్టర్ జయలక్ష్మి, డాక్టర్ హరిణి తదితరులు

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ ప్రోగ్రామర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రోగ్రామింగ్‌పై నమూనాలు ప్రదర్శించి రోజువారీ జీవితంలో దాని ప్రాముఖ్యతను వివరించారు. కోడ్ విజార్డ్, టెక్ క్విజ్, హగ్ ద బగ్, స్పిన్ ది వీల్ తదితర ఆటలు, ఈవెంట్లు నిర్వహించి విజేతలకు డాక్టర్ పి.కె.జయలక్ష్మి, డాక్టర్ హరిణి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కె.శిరీష్, ఎస్.మాధురి, అనితా రాణికుంకుమ్, ఊర్మిళ, బి. దఫియా తదితరులు పాల్గొన్నారు.

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం రూ.16.28 లక్షలు



హుండీ లెక్కిస్తున్న శివజ్యోతి, వేంకటేశ్వర సేవా సంఘం సభ్యులు

సీతమ్మధార : ఆశీలమెట్టలో గల సంపత్ వినాయగర్ ఆలయంలో దేవదాయ శాఖ తనిఖీదారు బి.వసంత్‌కుమార్ ఆధ్వర్యంలో హుండీని శనివారం లెక్కించగా 14 రోజులకు రూ.16.28 లక్షలు వచ్చాయి. బంగారం నాలుగు గ్రాముల 513 మిల్లీ గ్రాములు, వెండి 172 గ్రాముల 700 మిల్లీ గ్రాములు, ఇతర దేశాల డాలర్లు వచ్చినట్లు ఆలయ ఫౌండర్, ఫ్యామిలీ మెంబర్ టి.చోళన్ తెలిపారు. హుండీ లెక్కింపులో శివజ్యోతి, వేంకటేశ్వర సేవా సంఘం సభ్యులు, దేవాలయ సిబ్బంది జి.గోవింద రెడ్డి, డి.ఎస్. ప్రసాద్, ఈ. అప్పలరాజు, బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది పాల్గొన్నారు.

3న డయల్ యువర్ పోలీస్ కమిషనర్

అల్లిపురం: డయల్ యువర్ సీపీ కార్యక్రమాన్ని ఈ నెల 3న నిర్వహిస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ తెలిపారు. ఈ నెల 1, 2 తేదీల్లో సెలవు దినాలు కావడంతో 3న ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 0891-2523408 నంబర్‌కు కాల్ చేసి సమస్యలను సీపీ దృష్టికి తీసుకెళ్లవచ్చు. 94933 36633 నంబర్‌కు వాట్సాప్ చేసి కూడా ఫిర్యాదు చేయవచ్చు.

‘నీ వెంటే నేనున్నా’ ట్రైలర్ విడుదల



ట్రైలర్ విడుదల కార్యక్రమంలో పాల్గొన్న చిత్ర యూనిట్ సభ్యులు

అల్లిపురం : ‘నీ వెంటే నేనున్నా’ చిత్రం ట్రైలర్ శనివారం రాత్రి చిత్ర యూనిట్ విడుదల చేసింది. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో చిత్ర దర్శకుడు అన్వర్ మాట్లాడుతూ ఒక ఊరిలో ఇద్దరు ప్రేమికుల మధ్య జరిగిన యదార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు తెలిపారు. చిత్ర నాయికా, నాయకులు బాలసుబ్రహ్మణ్యం, స్నేహ మాట్లాడుతూ తమకు తొలి చిత్రమన్నారు. ఇందులో కొన్ని సన్నివేశాలు ప్రేక్షకులను మైమరిపిస్తాయన్నారు. నిర్మాత వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అక్టోబర్ 6న ఓటీటీ ద్వారా చిత్రం విడుదల చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంగీత దర్శకుడు షషాంక్ బాస్కరోని, నటీనటులు గణేష్, అనురాధ, దాడి సత్యనారాయణ పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

మురళీనగర్: ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు శనివారం పేద వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు ఎం.శేషామణి, కార్యదర్శి ఎస్.పుష్పలత, ఉపాధ్యక్షురాలు సిహెచ్.వరలక్ష్మి పాల్గొన్నారు.

ముగిసిన సీంబెక్స్-23 వేడుకలు



సీంబెక్స్2023 పోస్టర్‌ను చూపుతున్న కమాండింగ్ ఆఫీసర్లు

సింధియా: సింగపూర్ ఇండియా మారిటైమ్ ద్వైపాక్షిక ఎక్సర్‌సైజ్ సెప్టెంబర్‌తో 28 ముగిసింది. భారత నౌకాదళ నౌకలు రణ్‌విజయ్, కవరత్తి, అలాగే జలాంతర్గామి, ఐఎన్‌ఎస్ సింధుకేసరిలు మారిటైమ్ ద్వైపాక్షిక ఎక్సర్‌సైజ్ 30వ ఎడిషన్‌లో పాల్గొనేందుకు సింగపూర్ వెళ్లిన సంగతి తెలిసిందే. ఇండియన్ నేవీ, రిపబ్లిక్ ఆఫ్ సింగపూర్ నేవీ మధ్య వార్షిక ద్వైపాక్షిక నావికా వ్యాయామం 1994 నుంచి నిర్వహిస్తున్నారు. హార్బర్ ఫేజ్‌లో విస్తృత శ్రేణి వృత్తిపరమైన పరస్పర చర్యలు, సంయుక్త విమానయానం, అగ్నిమాపక నష్ట నియంత్రణ వ్యాయామాలు, ఇరు దేశాల జలాంతర్గాముల రెస్క్యూపై జాయింట్ స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసిజర్‌పై సంతకం చేసింది. సింగపూర్‌లో భారత హైకమిషనర్ అధికారులు, భారత నావికాదళ కమాండింగ్ అధికారులు, సింగపూర్ నేవీ ఫ్లీట్ కమాండర్లు, కారంజీ వార్ మెమోరియల్ వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు.

దిబ్బలపాలెం గణపతి లడ్డూ రూ.20 వేలు



వేలంలో పాడి దక్కించుకున్న లడ్డూతో జానకి రామయ్య, అసోసియేషన్ సభ్యులు

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ 29వ వార్డు మహారాణిపేటలో దిబ్బలపాలెం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాలు శనివారంతో ముగిసాయి. ముగింపు సందర్భంగా వరసిద్ధి వినాయకుని లడ్డూని వేలం వేశారు. వేలంలో లడ్డూని ప్రముఖ వ్యాపారవేత్త పూసర్ల జానకి రామయ్య రూ.20 వేలకి దక్కించుకున్నారు. అనంతరం నిర్వహించిన నిమజ్జన ఊరేగింపు దిబ్బలపాలెంలో ప్రారంభమై జగదాంబ జంక్షన్, దండు బజార్, ఎంవీడీ హైస్కూల్, కేజీహెచ్, కలెక్టర్ కార్యాలయం మీదుగా బీచ్‌రోడ్డుకు చేరుకుంది. అక్కడి నుంచి గోకుల్‌పార్క్, ఆర్కేబీచ్ మీదుగా వాల్తేర్ డిపో వద్ద సాగరతీరంలో స్వామి నిమజ్జన కార్యక్రమం జరిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు బండారు త్రినాథరావు, చిటికిరెడ్డి పవన్‌కుమార్, ఉరికిటి గిరీష్, ఎస్. శ్రీనివాసరాజు, బండారు లోకేష్, కట్టా యశ్వంత్‌కుమార్, సీహెచ్ అజయ్‌కుమార్, మణికంఠ, పసగాడ రామలింగేశ్వరరావు, చందక ప్రభాకరరావు, కళాకారులు తాడి శ్రీధర్, చంటి, తేజ, హరి, భాను, గౌతమ్, టైలర్ చిన్న, రాజు, అనిల్, ఆటో మణి, డీటీడీసీ శ్రీను, నర్సింహమూర్తి, కల్యాణ్, త్రినాథ్, కె. చంద్రశేఖర్, చందక ప్రవీణ్, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

వాడవాడలా అన్నసమారాధనలు



అన్నసమారాధనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



అన్నసమారాధనలో పాల్గొన్న అసోసియేషన్ సభ్యులు గోపీకృష్ణ తదితరులు

అల్లిపురం : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నియోజకవర్గంలో వాడవాడలా శనివారం అన్నసమారాధనలు విస్తృతంగా జరిగాయి. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పూర్ణామార్కెట్ దరి సర్దార్ వల్లబాయి పటేల్ వర్తక సంఘం సభ్యుడు సాహురెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని అన్నసమారాధనను ప్రారంభించారు. జ్ఞానాపురం వెజిటబుల్ మార్కెట్ వర్తక సంఘం సభ్యులు వీర్రాజు, రామచంద్రరావు, కూర్మారావునాయుడు ఆధ్వర్యంలో జరిగిన అన్నసమారాధనలో పాల్గొని ప్రారంభించారు. 37వ వార్డు కొత్తజాలారిపేట ప్రాంతంలో జరిగిన అన్నసమారాధనలో ఎమ్మెల్యే వాసుపల్లి పాల్గొని ప్రారంభించారు.

33వ వార్డులో..

వార్డులో నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం రోడ్డులో నీలమాంబ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సీతంరాజు సుధాకర్, వార్డు అధ్యక్షుడు రంథి గోపి పాల్గొన్నారు.

గణపతి నీలమాంబ యూత్ ఆధ్వర్యంలో..

శ్రీ గణపతి నీలమాంబ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. దాదాపు 8 వేల మంది పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు భీశెట్టి గోపాలకృష్ణ, ఆకుల రాజు, తారకేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

హోల్‌సేల్ మార్కెట్‌లో..

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం కాన్వెంట్ కూడలి న్యూహోల్‌సేల్ మార్కెట్‌లో వరసిద్ధి వినాయక మహోత్సవాలను పురస్కరించుకుని సౌభాగ్య గణపతి ఆలయ కమిటీ, వర్తక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ అన్నసమారాధనను ప్రారంభించారు. సుమారు 5 వేల మందికి అన్నదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. వర్తక సంఘం సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లేని యూజీడీకి పైపుల అనుసంధానం తగదు

- బంగారుమెట్ట వాసుల ఆవేదన



యూజీడీ కోసం రోడ్డును తవ్వుతున్న వర్కర్లు

అల్లిపురం : అసంపూర్తిగా ఉన్న యూజీడీకి ఒక అపార్ట్‌మెంట్ వాసులు పైపులు అనుసంధానించడాన్ని బంగారుమెట్ట వాసులు వ్యతిరేకిస్తున్నారు. 2009లో భారీ రాయి పడిందని పైపులైన్లు వేయకుండా మ్యాన్‌హోల్స్ మాత్రమే ఏర్పాటు చేశారని, వాటికి సెప్టిక్ ట్యాంక్ వాటర్‌ను ఎలా అనుసంధానిస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. జీవీఎంసీ అధికారులు ఏ విధంగా అనుమతులిచ్చారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం ఉదయం బంగారుమెట్ట, జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల పక్కనే గల సూర్య అపార్టుమెంట్‌వాసులు యూజీడీ కనెక్షన్ కోసం ఇటీవలే 15 రోజుల క్రితం వేసిన రోడ్డును తవ్వడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. లేని యూజీడీకి కనెక్షన్ ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. దీనిపై యూజీడీ అధికారులను సంప్రదించినా వారు స్పందించకపోవడం విశేషం. జోనల్ కమిషనర్ శివప్రసాద్‌ను వివరణ కోరగా 33వ వార్డులో పలుచోట్ల యూజీడీ పనులు పూర్తి కాలేదని, పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. యూజీడీ పనులు పూర్తి చేస్తే మిగిలిన వారు కూడా యూజీడీ కనెక్షన్లు కలుపుకుంటారని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు.

ఖైదీ మృతిపై 7న మెజిస్టీరియల్ విచారణ

మహారాణిపేట: సెంట్రల్ జైలులో ఖైదీగా ఉన్న పాలసి వెంకటరావు మృతిపై ఈనెల 7న ఉదయం 11 గంటలకు మెజిస్టీరియల్ విచారణ చేస్తున్నట్లు విశాఖ రెవెన్యూ డివిజనల్ అధికారి డి.హుస్సేన్ సాహెబ్ తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం బొంజంగి గ్రామం కించూరు పంచాయతీకి చెందిన పాలసి వెంకటరావు ఒక కేసులో సెంట్రల్ జైలులో ఖైదీగా ఉన్నారు. సెప్టెంబర్ 14న అనారోగ్యానికి గురి కావడంతో కేజీహెచ్‌కు తరలించారు. 15వ తేదీన చికిత్స పొందుతూ మృతి చెందాడని ఆర్‌డీవో తెలిపారు. దీనిని లాకప్ డెత్‌గా పరిగణించి మెజిస్టీరియల్ విచారణ చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున నిర్ణయించారు. ఈ విచారణ కోసం విశాఖ ఆర్‌డీవోను విచారణ అధికారిగా నియమించారు. విశాఖ ఆర్‌డీవో కార్యాలయంలో 7న విచారణ చేస్తున్నామని, వెంకటరావు కోసం తెలిసిన వారు విచారణకు హాజరై, లిఖిత పూర్వకంగా తెలియజేయాలని ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ తెలిపారు.

వేద చైతన్యదీపిక రంగప్రవేశం నేడు



సమావేశంలో మాట్లాడుతున్న నేమాని విశ్వశాంతి

దాబాగార్డెన్స్ : శ్రీవిశ్వ కూచిపూడి కళాక్షేత్రం ప్రతినిధి నేమాని విశ్వశాంతి సారథ్యంలో అక్టోబర్ 1 సాయంత్రం 6 గంటలకు మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో వేద చైతన్య దీపిక కూచిపూడి రంగ ప్రవేశం నిర్వహించనున్నట్లు నేమాని విశ్వశాంతి తెలిపారు. ఈ మేరకు శనివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి స్టార్‌మేకర్ సత్యానంద్ హాజరు కానున్నట్టు చెప్పారు. అలాగే ఎస్‌పి రాధిక, హరిరామమూర్తితో పాటు పలువురు ప్రముఖుల ఆశీస్సులతో చైతన్య దీపిక రంగ ప్రవేశం చేయనున్నారని చెప్పారు. విద్యార్థి చైతన్య దీపిక తన అద్భుత కూచిపూడి కళా ప్రదర్శనతో అందర్నీ ఆకట్టుకుంటుందని చెప్పారు. కూచిపూడి విద్యార్థిని చైతన్య దీపిక మాట్లాడుతూ తాను విశాఖలోనే కూచిపూడి విద్యనభ్యసించానని, ఉద్యోగరీత్యా తాను హైదరాబాద్ వెళ్లడంతో అక్కడ నేమాని విశ్వశాంతి వద్ద శిక్షణ తీసుకున్నట్లు తెలిపారు. శిక్షణ తనలో ఎంతో చైతన్యాన్ని తీసుకు వచ్చిందన్నారు. అక్టోబర్ ఒకటిన మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో తన రంగప్రవేశానికి ప్రతి ఒక్కరు హాజరై ఆశీస్సులు అందించాలని కోరారు.